# జబర్దస్త్‌గా.. జంక్షన్లు




- ఐలాండ్‌లు, ఫౌంటెన్లతో కళకళ
- విద్యుద్దీపాలు, గ్రీనరీతో నూతన శోభ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

**నాడు**
కేవలం ప్రముఖులున్న ప్రాంతాలనే అభివృద్ధి చేసేవారు. పేదలు నివసించే ఏరియాలు, మురికివాడల ఊసే ఉండేది కాదు. వర్షాకాలం వస్తే అనేక ప్రాంతాలు జలమయం అయిపోయేవి. మురుగు, చెత్తతో పేద ప్రజలు వ్యాధుల బారిన పడేవారు. జంక్షన్ల అభివృద్ధి అంటూ అస్సలు జరిగేదే కాదు.

**నేడు**
ఎలాంటి వివక్ష లేకుండా అన్ని ప్రాంతాలు ఒక్కలా అభివృద్ధి జరుగుతున్నాయి. రోడ్లు నిర్మిస్తూ, జంక్షన్లు అభివృద్ధి చేస్తూ ఎక్కడికక్కడ ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడుతున్నారు. అనేక దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉండిపోయిన జగదాంబ-వన్‌టౌన్ రహదారి సమస్య పరిష్కారానికి ఇప్పటికే రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించారు. అనేక చోట్ల జంక్షన్లు ఆధునీకరించి, కొత్తగా తీర్చిదిద్దారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనా పగ్గాలు చేతపట్టిన నాటి నుంచి సంక్షేమ పాలనతో అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందజేస్తున్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. పేదలకు మౌలిక వసతులు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కృషి చేస్తున్నారు. గత ప్రభుత్వాలు విఫలమైన పలు అంశాలు చేపట్టి భేషుకైన రీతిలో సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు.


దుర్గాలమ్మ గుడి జంక్షన్

దాబాగార్డెన్స్ : విశాఖ పరిపాలన రాజధానిగా అవతరిస్తున్న నేపథ్యంలో నగరం కొత్త పుంతలు తొక్కుతోంది. ఐల్యాండ్‌లు.. జంక్షన్లు కొత్త పుంతలతో.. విద్యుద్దీపాలంకరణతో విరాజిల్లుతున్నాయి. వాటర్ ఫౌంటైన్లతో జంక్షన్లు సుందరీకరిస్తున్నారు. అందుకు నిదర్శనమే ఇటీవల నగరంలో పలు ప్రాంతాల్లో గల ఐల్యాండ్లు, జంక్షన్ల ఆధునీకరణ.

**రూ.2.3 కోట్లతో జగదాంబ జంక్షన్ ఆధునీకరణ..**
జోన్-4 పరిధి జగదాంబ జంక్షన్‌ను రూ.2.3 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో అత్యాధునికంగా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. తెన్నేటి విశ్వనాథం పార్క్ జంక్షన్‌కు నాలుగు వైపులా కనిపించేలా 20 మీటర్ల ఎత్తులో క్లాక్‌టవర్ ఏర్పాటు చేయనున్నారు. చుట్టూ గ్రీనరీ, వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు చేసి విద్యుద్దీపాలతో అభివృద్ధి చేయనున్నారు. అక్కడి నుంచి లేపాక్షి జంక్షన్ వరకు గ్రీనరీ ఏర్పాటు కానుంది. సిటీ లుక్స్‌తో జగదాంబ జంక్షన్‌కు కొత్త హంగులు తేనున్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గ పరిధిలో డాల్ఫిన్ జంక్షన్, వాల్తేర్ అప్‌రోడ్డు జడ్జి కోర్టు, గౌతులచ్చన్న విగ్రహం ఉన్న జంక్షన్‌ను ఆధునికీకరిస్తున్నారు.


రైల్వే న్యూకాలనీ జంక్షన్‌లో రైల్వే ఇంజిన్‌తో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్


జగదాంబ జంక్షన్ ఆధునీకరణ పనులు ప్రారంభిస్తున్న మేయర్, విశాఖ ఎంపీ, ఎమ్మెల్యే (ఫైల్)

**పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ గుడి, బౌడారారోడ్డు జంక్షన్లకు మహర్దశ..**
జగదాంబ : జగదాంబ జంక్షన్ నుంచి వన్‌టౌన్ వరకు రూ. 12 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. జీవీఎంసీ 35వ వార్డులో పూర్ణామార్కెట్ జంక్షన్ నుంచి రామకృష్ణా జంక్షన్ వరకు రూ. 45 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు. దుర్గాలమ్మ గుడి జంక్షన్, బౌడారా రోడ్డు కూడలిని అభివృద్ధి చేయడంతో ఇక్కట ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయింది.

**వ్యాపారాల అభివృద్ధి..**
నగరంలో ప్రముఖ్యమైన పూర్ణామార్కెట్ జంక్షన్‌కు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. అనకాపల్లి, అల్లూరి, విజయనగరం , శ్రీకాకుళం ప్రజలు కూడా ఈ మార్కెట్‌ను ఆశ్రయిస్తారు. అటువంటి పూర్ణామార్కెట్ జంక్షన్ అభివృద్ధి జరగడంతో ఈ ప్రాంతాన్ని ఆశ్రయించుకుని బతుకున్న పలువురు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలుదారులు రావడానికి, వాహనాలు తిరగడానికి జంక్షన్ల అభివృద్ధి బాగా ఉపయోగపడిందని చెబుతున్నారు.

తెన్నేటి విశ్వనాథం పార్క్ జంక్షన్‌లో ఏర్పాటు కానున్న 20 మీటర్ల ఎత్తయిన క్లాక్‌టవర్

రూ.2.3 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో జగదాంబ జంక్షన్ అభివృద్ధి

రూ. 45 లక్షలతో దుర్గాలమ్మ గుడి జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్‌కొత్తరోడ్డు జంక్షన్ల ఆధునికీకరణ

రూ. 12 కోట్లతో జగదాంబ నుంచి వన్‌టౌన్ రోడ్డు విస్తరణ (పనులు జరుగుతున్నాయి)


పూర్ణామార్కెట్ జంక్షన్ నాడు


పూర్ణామార్కెట్ జంక్షన్ నేడు


బౌడారారోడ్డు జంక్షన్ నాడు


బౌడారారోడ్డు జంక్షన్ నేడు

### నా వ్యాపారం పుంజుకుంది



పూర్ణామార్కెట్ జంక్షన్‌లో తోపుడు బండి ద్వారా వ్యాపారం చేస్తుంటాను. ఇక్కడ గతుకుల రహదారి వలన మురుగు నీరు నా షాపు వరకు వచ్చేసేది. దాంతో కొనుగోలుదారులు ఎవరూ నా షాపుకు పెద్దగా వచ్చే వారు కాదు. ప్రభుత్వం ఇటీవల రోడ్లు, కూడళ్లు బాగు చేయడంతో నా వ్యాపారం పుంజుకుంది.

–శ్రీనివాసరావు, పూర్ణామార్కెట్ వ్యాపారి

### వ్యాపారులకు మంచి జరిగింది..



నేను తోపుడు బండి ద్వారా పండ్ల వ్యాపారం చేస్తుంటాను. పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ కూడళ్ల అభివృద్ధితో 1500 మంది చిరు వ్యాపారులకు మోక్షం కలిగింది. జంక్షన్ల అభివృద్ధి వినియోగదారులు, వాహనాల రాకపోకలకు వీలు కలిగి మా వ్యాపారాలు బాగా జరుగుతున్నాయి. జగనన్న అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారనడానికి ఇదే నిదర్శనం.

–గోవింద్, పూర్ణామార్కెట్ పండ్ల వ్యాపారి

### బతుకులు బాగుపడ్డాయి..



పుట్టి పెరిగిన నాటి నుంచి పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ కూడళ్ల వద్దే వ్యాపారాలు చేసుకుంటున్నాం. వీటిని అభివృద్ధి చేయడం గతంలో ఎరగం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ జంక్షన్లు బాగుపడ్డాయి. మా వ్యాపారాలు మెరుగుపడ్డాయి.

–సత్యవతి, సుద్దముక్కల వ్యాపారి, స్ప్రింగ్‌రోడ్డు ప్రాంతం

## క్లుప్తంగా

### మహాధర్నా విజయవంతానికి పిలుపు


విజయవాడ బయలుదేరిన ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు

అల్లిపురం : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, సామాన్య ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మన్మథరావు, జీఎస్‌జే అచ్యుతరావు కోరారు. ఆదివారం 200 మంది కార్మికులు, నాయకులు రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ, పారిశ్రామిక కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, మైనార్టీలు, దళితులు, షెడ్యూలు తెగల వారితో సహా సమస్యల పరిష్కారానికి బీజేపీని ఓడించే లక్ష్య సాధనలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### ఎర్నిమాంబకు పౌర్ణమి పూజలు


ప్రత్యేక పూజలు అందుకుంటున్న ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం కార్తీక శుద్ధ పౌర్ణమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

### ఘనంగా రాధాకృష్ణుల యదుమేళా

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు పరిధి శ్రీకృష్ణా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాధాకృష్ణ పాలు పెరుగు యదుమేళా ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, నాయకులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

**ఊటగెడ్డలో..**
కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఊటగెడ్డలో శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రాధాకృష్ణ పాలు పెరుగు యదుమేళాలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ క్లస్టర్-4 మండల అధ్యక్షుడు, అఖిల భారతీయ యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీతల వాసు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ సేవా సమితి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

### 29 నుంచి మాదకద్రవ్యాల నిరోధంపై యాత్ర

దాబాగార్డెన్స్ : హిమా హ్యూమానిటేరియన్ సంస్థ, సింహాద్రి టీఎంటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి మాదకద్రవ్యాల నిరోధంపై దక్షిణ భారతదేశ యాత్ర నిర్వహించనున్నట్లు హిమా చైర్మన్ బీఎస్ మూర్తి, అధ్యక్షుడు సరగడం సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మాదకద్రవ్యాల అవగాహన ర్యాలీని ఆ రోజు ద్వారకానగర్‌లో గల బీవీకే కళాశాల వద్ద మేయర్ గొలగాని హరి వెంకటకుమారి జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మీదుగా ఈ యాత్ర దాదాపు 25 రోజుల పాటు కొనసాగుతుందని చెప్పారు. యాత్రలో హిమా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి టీవీడీ దాస్, ఉపాధ్యక్షుడు డాక్టర్ బీవీఎన్ నందా, ఎం. కాశీ విశ్వనాథ్, ఎస్‌కే ఖాసీం పాల్గొంటారని తెలిపారు.

## గౌరీ పరమేశ్వరులకు కార్తీక పౌర్ణమి పూజలు


అమ్మవారికి బంగారు ఆభరణాలు అందజేస్తున్న కర్రి చేతన్ ఆనంద్, కృపాసాగర్ తదితరులు

అల్లిపురం : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని వేంకటేశ్వరమెట్టపై శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలలో ప్రత్యేక దీపోత్సవం నిర్వహించారు. అమ్మవారిని పండ్లు, కాయలతో విశేషంగా అలంకరించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయనకు గౌరీ పరమేశ్వరుల తీర్థ ప్రసాదాలు అందజేశారు. గౌరీ పరమేశ్వరులకు వేంకటేశ్వరమెట్ట నివాసులు కర్రి చేతన్ ఆనంద్, కోరిబిల్లి కృపాసాగర్ రెండున్నర తులాల బంగారు ఆభరణాలు బహుమతిగా అందజేశారు. అమ్మవారికి పూజలు చేసి, సారె సమర్పించారు.

**అంబికాబాగ్ రామాలయంలో..**
దాబాగార్డెన్స్ : కార్తీక పౌర్ణమి, కృత్తికా నక్షత్రాలను పురస్కరించుకుని మహారాణిపేటలో గల కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతా రామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు పాల్గొన్నారు.

### ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనులవుతారు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనలువుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 1018వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులతో పాటు వైస్సార్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

## రిజర్వేషన్ల అమలుతోనే సమాన అవకాశాలు


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైరపర్సన్ సుభద్ర

మహారాణిపేట : రిజర్వేషన్ల అమలు సాధ్యమైనప్పుడే అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు లభిస్తాయని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా పరిషత్ అతిథి గృహంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**జిల్లా పరిషత్‌లో..**
జిల్లా పరిషత్‌లో సీఈవో పోలినాయుడు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నప్పుడు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు. ఈ కార్యాక్రమంలో జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**35వ వార్డు పండా వీధిలో..**
జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు పండావీధిలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ నాయకుడూ అమలు చేయని రాజ్యంగం రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అమలు చేస్తున్నారన్నారు.

**మహిళాల కళాశాలలో..**
దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. దాబాగార్డెన్స్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె. గీతాంజలి, వహీదా తదితరులు పాల్గొన్నారు.

**ఏవీఎన్ కాలేజీలో..**
ఏవీఎన్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఏయూ ఎంహెచ్‌ఆర్ఎం రిటైర్డ్ ప్రొఫెసర్ కె. జాన్ హాజరై బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించి దేశ పౌరులందరికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించారని కొనియాడారు. ఏయూ పొలిటికల్ సైన్స్ హెడ్ ప్రొఫెసర్ జయరామారావు, కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

**జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..**
జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు పాల్గొని పాఠకులచే ప్రతిజ్ఞ చేయించారు. డీసీఎల్ ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు, కార్యదర్శి వెంకట్రావు, సమాజ హిత అధ్యక్షుడు కేవీఎస్ నరసింహం, పాఠకులు పాల్గొన్నారు.

### కోవిడ్ అనంతర వ్యాధులపై అవగాహన

మహారాణిపేట : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్ విశాఖ శాఖ ఆధ్వర్యంలో కోవిడ్ తదుపరి ఇబ్బందులు, వ్యాధులకు అందించనున్న శాస్త్రీయ హోమియో చికిత్సపై చర్చించారు. సంస్థ జాతీయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం నిరంతర వైద్య విద్యా కార్యక్రమాల (సీఎంఈ) కన్వీనర్ డాక్టర్ వి.హేమలత నిర్వహణలో జరిగిన హోమియో వర్క్‌షాప్‌లో సీనియర్ హోమియో వైద్యులు డాక్టర్ బి.ఎస్.వెంకటేశ్వరరావు, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ ఆనందరావు, డాక్టర్ రాధికా తదితరులు పోస్ట్ కోవిడ్ వ్యాధులకు వైవిధ్యమైన చికిత్సా విధానాలను బోధించారు. డాక్టర్ పి.దుర్గాదేవి క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇటీవల స్వర్గస్తులైన డాక్టర్ చక్రవర్తికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.రాఘవేంద్రరావు, డాక్టర్ శివకాంతి పాల్గొన్నారు.

### ఘనంగా ఎన్‌సీసీ డే

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఆదివారం ఎన్‌సీసీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఎన్‌సీసీ ఉన్నతాధికారి ఎం.ఎస్.వి.విశ్వనాథం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు పరుగు పందెం, డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. డ్రిల్‌లో ఎం.శృతి, ఎ.శ్రావణి, ప్రవీణ్‌కుమార్, పి.హర్ష విజేతలుగా నిలిచారు. వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్‌లో కె.యమున, టి.నవ్యశ్రీ, కె.రోహిత్, రోషన్ గెలుపొందారు. పరుగు పందెంలో ఎ.భార్గవి, షేక్ చాందిని, జి.శివ, వి.గోపీచంద్ విజయం సాధించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ నరస, కల్నల్ అజయ్‌కుమార్, సుబేదార్ మేజర్ సజీవన్ పాల్గొన్నారు.

## జాతీయవాది ‘పురిపండా’


ప్రసంగిస్తున్న డాక్టర్ బండి సత్యనారాయణ

మహారాణిపేట : జాతీయవాదిగా, అభ్యుదయ రచయితగా పురిపండా అప్పల స్వామి సామాజిక ప్రగతికి చేసిన కృషి అనిర్వచనీయమని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బండి సత్యనారాయణ అన్నారు. ఆదివారం టర్నర్ సత్రంలో 22వ విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో భాగంగా అరసం జిల్లా సమితి నిర్వహిస్తున్న సాహిత్య సదస్సులో భాగంగా ఆదివారం పురిపండా సాహిత్య జీవితం, శ్రీశ్రీ సాహిత్యంలో విప్లవం అనే అంశాలపై సదస్సులు జరిగాయి. అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీశ్రీ జీవితం విప్లవం అనే అంశంపై డాక్టర్ మాటూరి శ్రీనివాస్, కేవీఎస్ మూర్తి, ఆచార్య వెలమల సిమ్మన్న, మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, బొట్ట అప్పారావు తదితరులు మాట్లాడారు. అరసం కార్యదర్శి డాక్టర్ సి.ఎస్. క్షేత్రపాల్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ. రాజు, సాహితీవేత్తలు మధుసూదన్‌రావు, హనుమంతరావు పాల్గొన్నారు.

## కాలి నడకన తిరుమలకు..


కాలి నడకన తిరుమల బయలుదేరుతున్న సూర్యనారాయణ

సీతమ్మధార : వాడ్రాపల్లిలో ఉన్న కమల వైభోగ స్వామి ఆలయ అభివృద్ధికి తిరుమల కొండకు మునగపాక మండలం, వాడ్రాపల్లి గ్రామానికి చెందిన పిల్లి సూర్యనారాయణ ఆదివారం ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్‌ను దర్శించుకుని బయలుదేరారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ డ్రైవర్‌గా 40 సంవత్సరాలు పని చేసిన ఆయన 2019లో పదవీ విరమణ చేశారు. కమల వైభోగ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన తన ప్రయాణంలో కమల వైభోగ స్వామి, అనకాపల్లి నూకాలమ్మ తల్లి, అన్నవరం సత్యనారాయణస్వామి, విజయవాడలోని కనకదుర్గ అమ్మవారు, సింగరాయకొండలోని వేంకటేశ్వర స్వామి, మంగళగిరి పానకాల నరసింహస్వామిని దర్శించుకుని తిరుమల వేంకటేశ్వర స్వామి సన్నిధికి చేరుకోనున్నట్లు తెలిపారు.

### డాక్టర్ మురళీమోహన్‌రావుకు ఐఎంఏ అవార్డు

మహారాణిపేట: కోవిడ్ సమయంలో అందించిన సేవలకు గుర్తింపుగా విశాఖకు చెందిన డాక్టర్ ఎం.వి.వి.మురళీమోహన్‌రావుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అవార్డు ప్రదానం చేసింది. ఆదివారం మంగళగిరిలో జరిగిన ఐఎంఏ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీహరిరావుల నుంచి ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా డాక్టర్ మురళీమోహన్‌రావు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో ఐఎంఏ నాయకులు జె.సి.నాయుడు, డాక్టర్ సమరం పాల్గొన్నారు.

### వెలమ గర్జన విజయవంతానికి పిలుపు

దాబాగార్డెన్స్ : ప్రధాన రాజకీయ పార్టీలు వెలమ సామాజిక వర్గానికి జనాభా దామాషా పద్ధతిలో అధిక అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 7న విశాఖ వేదికగా నిర్వహించనున్న వెలమ గర్జన విజయవంతం చేయాలని సంఘీయులను కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పట్టా శ్రీధర్, పెదిరెడ్ల సత్యం, పెదిరెడ్ల శ్రీనివాస్, రమణ, చోడవరం పైడపునాయుడు, గొల్లు రాము, తెంటు రామారావు, కర్రి రామూర్తినాయుడు, అనంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి వినతి

దాబాగార్డెన్స్ : నూతనంగా ఎన్నికైన ఏపీ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. కృష్ణమోహన్ నేతృత్వంలో నూతన కార్యవర్గ సభ్యులు పుర పరిపాలన శాఖ ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు డిమాండ్ల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు నాయుడుబాబు, పాపయ్యరాజు, వెంకటేష్, పావని, అబిదాబేగం, శ్రీఆంజనేయులు, గిరిధర్‌బాబు, చెంచయ్య, చాంద్‌బాషా, షేక్‌వల్లీ, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.